సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 28 । జూన్ । 2024



సమస్యల వలయంలో..
నస్రుల్లాబాద్‌లోని గురుకుల పాఠశాల సమస్యల నిలయంగా మారింది. వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.
- 10లో ▸



జోరుగా తనిఖీలు
జిల్లాలోని పలు ప్రాంతాలలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు.
- 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /23.7

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

‘సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా’



కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ పేర్కొన్నారు. గురువారం ఆమె పట్టణంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కామారెడ్డి పెద్ద చెరువును, బుర్రమత్తడి కాలువను పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగింపజేశారు. 24వ వార్డులోని ప్రకృతి వనాన్ని పరిశీలించారు. పట్టణంలోని ప్రకృతివనాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు లత, శివకృష్ణమూర్తి, ఇమ్రాన్, నజీరుద్దీన్, మమత, నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, అంజాద్, సాయిబాబా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి’



కామారెడ్డి క్రైం: దేశవ్యాప్తంగా వచ్చేనెల ఒకటో తేదీనుంచి నూతన చట్టాలు అమలు కానున్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం పోలీసులకు నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడతల వారీగా అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇప్పటివరకు 17 విడతలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నూతన చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నపుడే విధులను సమర్థవంతంగా నిర్వహించగలమన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

స్పౌజ్ సర్టిఫికెట్ సమర్పించాలి

కామారెడ్డి టౌన్: ఇటీవల పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు శుక్రవారం స్పౌజ్ సర్టిఫికెట్ సమర్పించాలని డీఈవో రాజు సూచించారు. స్పౌజ్ కేటగిరిలో బదిలీల కోసం గతేడాది సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నవారికి ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎవరైనా స్పౌజ్ కేటగిరిని వద్దనుకుంటే డీఈవో కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో గెస్ట్ పీజీటీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ జువాలజీ, బోటనీ పోస్టుల భర్తీ కోసం కళాశాలలో శనివారం నిర్వహించే డెమోకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరం



భిక్కనూరు: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, భ్రూణ హత్యలను నివారించాలని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శిరీష అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వంద రోజుల అవగాహన కార్యక్రమాన్ని గురువారం మండల ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ షహేమీ మా, సిబ్బంది శారద, సౌందర్య పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థ డీఎంగా రమేశ్

సుభాష్‌నగర్: పౌరసరఫరాల సంస్థ నిజామాబాద్ జిల్లా మేనేజర్‌గా రమేశ్ (డిప్యూటీ కలెక్టర్) గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రమేశ్ హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డీఎంగా పనిచేసిన జగదీశ్‌కుమార్ గతనెల 30న సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేనేజర్ రాజేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి మేనేజర్‌ను నియమించారు.

తాకట్టు పెట్టు.. లోన్ పట్టు..

- బ్యాంకుల్లో సులువుగా లభిస్తున్న గోల్డ్‌లోన్
- అవసరానికి ఆభరణాలు కుదువ పెడుతున్న పలువురు
- ప్రతి నెలా రూ.10 కోట్లకుపైగా రుణాలు..

బంగారం అంటే మహిళలకు మక్కువ ఎక్కువ. వివాహాది శుభకార్యాలు, పండుగలకు పుత్తడిని కొనుగోలు చేస్తుంటారు. ఆభరణాలను ధరించడాన్ని స్టేటస్ సింబల్‌గా భావిస్తారు. అలాంటి బంగారాన్ని తనఖాగా పెట్టుకుని బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయి. సులువుగా రుణం మంజూరవుతుండడంతో జిల్లాలో గోల్డ్ లోన్ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది.





సాక్షి, కామారెడ్డి: బంగారు ఆభరణాలు తనఖా పెట్టుకుని రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు డోర్లు బార్లా తెరిచాయి. దీంతో ఎవరికి డబ్బులు అవసరం ఉన్నా ఎవరినో బతిమాలాల్సిన పనిలేకుండా సమీపంలో ఉన్న బ్యాంలకు పరుగుపెడుతున్నారు. తమ దగ్గర ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని వెళ్లి బ్యాంకులో ఉండే అప్రైజర్‌ను కలిస్తే చాలు ఆభరణాలను తూకం వేసి, ఎంత లోన్ వస్తుందో లెక్కవేసి చెబుతారు. వెంటనే బ్యాంకు సిబ్బంది లోన్ ప్రాసెస్ చేసి నిమిషాల్లోనే రుణం మంజూరు చేస్తున్నారు. ఈ ప్రక్రియ సులువుగా ఉండడంతో చాలా మంది మధ్య తరగతి ప్రజలు తమ ఆర్థికావసరాలను తీర్చుకోవడం కోసం గోల్డ్ లోన్ తీసుకుంటున్నారు.

జిల్లా కేంద్రంతో పాటు ఆయా పట్టణాలు, మండల కేంద్రాలే కాక మారుమూల గ్రామాల్లోనూ బ్యాంకుల శాఖలు విస్తరించాయి. చాలావరకు బ్యాంకులు బంగారంపై రుణాలు ఇస్తున్నాయి. అవసరానికి అప్పులు పుట్టని పరిస్థితుల్లో ఎక్కువ మంది గోల్డ్ లోన్‌లు తీసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు.

బయట ఫైనాన్సులు, వడ్డీ వ్యాపారుల వద్ద అడ్డగోలు వడ్డీలు నడుస్తుండడం, బంగారంపై తక్కువ వడ్డీలకే రుణాలు లభిస్తుండడమూ గోల్డ్ లోన్‌లు పెరగడానికి కారణాలే.. ప్రధాన బ్యాంకులతోపాటు జిల్లా సహకార కోఆపరేటివ్ బ్యాంకు సైతం బంగారంపై రుణాలు ఇస్తున్నాయి. ఇవికాకుండా మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరాం చిట్స్, యూఏఈ ఎక్స్ఛేంజ్ వంటి సంస్థలు సైతం గోల్డ్ లోన్‌లు అందిస్తున్నాయి. డబ్బులు సమకూరినపుడు అప్పు కట్టి ఆభరణాలను విడిపించుకుంటున్నారు. కాగా డబ్బున్న వారు సైతం బంగారంపై అప్పు తీసుకుని ఇతర రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నట్లు తెలుస్తోంది. లాకర్లలో బంగారం ఉంచి అద్దె చెల్లించే బదులు, బంగారాన్ని కుదువపెట్టి లోన్ తీసుకుని దాని ద్వారా వ్యాపారాలను విస్తరించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

బంగారంపై తీసుకునే లోన్‌పై వడ్డీలు రకరకాలుగా ఉంటున్నాయి. రైతులు తమ అవసరాల కోసం బ్యాంకులో బంగారం తాకట్టు పెడితే తక్కువ వడ్డీకే రుణం మంజూరవుతుంది. దీంతో చాలామంది రైతులు బ్యాంకులకు వెళ్లి అప్పులు తీసుకుంటున్నారు. అలాగే

బ్యాంకుల్లో కిలోల కొద్దీ ఆభరణాలు

డబ్బు అవసరాల కోసం బంగారం తనఖా పెడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. కొన్నిచోట్ల బ్యాంకుల్లో అప్రైజర్లు, లోన్ చేసే సిబ్బంది రోజంతా అదే పనిలో ఉండాల్సి వస్తోంది. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో కలిపి ప్రతినెలా రూ.10 కోట్లకుపైగా గోల్డ్ లోన్ మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో కిలోల కొద్ది బంగారం బ్యాంకులకు చేరుతున్నట్లు తెలుస్తోంది.

అప్పు తీర్చకపోతే వేలం..

మధ్య తరగతి ప్రజలు తమ అవసరాల కోసం అప్పటికప్పుడు గోల్డ్ తనఖా పెట్టి లోన్ తీసుకుంటున్నారు. తీసుకున్న లోన్ తిరిగి చెల్లించడానికి రకరకాలుగా వాయిదాలు ఉంటున్నాయి. మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాది వాయిదాలలో అప్పు తీర్చవచ్చు. అయితే గోల్డ్ లోన్ తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించకపోతే నోటీసులు ఇస్తారు. అయినా స్పందించకపోతే వారు తనఖా పెట్టిన ఆభరణాలను వేలం వేసే అధికారం బ్యాంకులకు ఉంటుంది.

నాణ్యత ఆధారంగా రుణం...

బ్యాంకులో తనఖా పెట్టే ఆభరణం నాణ్యత ఆధారంగా లోన్ ఇస్తారు. 24 క్యారెట్ల ప్యూర్ బంగారం అని అప్రైజర్ నిర్ధారిస్తే బంగారం మార్కెట్ ధరపై 90 శాతం దాకా లోన్ ఇస్తారు. నాణ్యత తక్కువగా ఉంటే 70 శాతం నుంచి 80 శాతం దాకా లోన్ ఇస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో బంగారం ధర రూ.72 వేల పైచిలుకు ఉంది. 10 గ్రాముల బంగారు ఆభరణానికి రూ.50 వేలపైనే రుణం ఇస్తున్నారు. వాయిదాల ఆధారంగా వడ్డీ రేటు ఉంటుంది.

‘సాగర్’ గేట్లకు స్టాప్‌లాక్

- లీకేజీలను అరికట్టేందుకు అధికారుల చర్యలు
- త్వరలో పనులు ప్రారంభం



నిజాంసాగర్ ప్రధాన కాలువ గేట్లు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల వద్ద లీకేజీని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జెన్‌కో గేట్ల తరహాలో స్టాప్‌లాక్ ఏర్పాటు చేయనున్నారు. 1970లో ప్రాజెక్ట్ ప్రధాన కాలువకు ఆయకట్టుకోసం ఐదు గేట్లు, విద్యుత్ ఉత్పత్తి కోసం ఐదు గేట్లు ఏర్పాటు చేశారు. ఆయకట్టు కింద పంటల సాగుతో పాటు పట్టణ ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే జల విద్యుదుత్పత్తి దృష్ట్యా జెన్‌కో గేట్ల ద్వారా ప్రధాన కాలువకు నీటి విడుదలకు ప్రాధాన్యత ఇస్తారు. అయితే వర్షాకాలంలో వరద ప్రవాహానికి ప్రాజెక్టులోకి వ్యర్థ పదార్థాలతో పాటు కలప, ఇతరత్రా సామగ్రి కొట్టుకు వచ్చి ప్రధాన కాలువ గేట్ల వద్ద నిలుస్తుంది. దీంతో ప్రధాన కాలువకు నీటి విడుదల సమయంలో గేట్లు మొరాయిస్తున్నాయి. అంతేగాకుండా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సైడ్ రాడ్లు దెబ్బతింటున్నాయి. ఇరిగేషన్ విభాగంలోని ఐదు గేట్లలో ఒక గేటు పూర్తిగా బురదలో కూరుకుపోగా.. రెండు గేట్లు పైకి లేవడం లేదు. దీంతో ప్రస్తుతం రెండు గేట్ల ద్వారానే కాలువకు నీటిని వదులుతున్నారు. మరోవైపు ఈ గేట్ల ద్వారా నీరు లీకై వృథా అవుతోంది. దీంతో ప్రధాన కాలువ గేట్ల వద్ద స్టాప్‌లాక్ ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి.

మరమ్మతులకు సన్నద్ధం

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఇరిగేషన్ గేట్ల మరమ్మతులపై నీటి పారుదలశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో గేట్ల మరమ్మతులు, స్టాప్ లాక్ పనులు చేపట్టనున్నారు. డ్యాం సేఫ్టీ అధికారుల సూచన మేరకు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు నిధులు రావడంతో పనులు చేసే యోచనలో ఉన్నారు. హెడ్ స్లూయిస్ వద్ద ప్రధాన కాలువ గేట్ల ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభించనున్నారు. ఏటా గేట్లు మొరాయిస్తుండడంతో లీకేజీల ద్వారా వందలాది క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. లీకేజీలను అరికట్టేందకు ఏటా విశాఖపట్నం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి లీకేజీలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తి చేస్తే లీకేజీ బాధలు తప్పనున్నాయి.

జాతీయ సమైక్యత శిబిరం ప్రారంభం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని కళాభారతి స్టేడియంలో యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరం గురువారం ప్రారంభమైంది. మున్సిపల్ కార్యాలయం వద్ద బల్దియా చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, యువజన క్రీడల జిల్లా అధికారి దామోదర్‌రెడ్డి, యునైటెడ్ యూత్ ప్రాజెక్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు జెండా ఊపి జాతీయ సమైక్యత ర్యాలీని ప్రారంభించారు. సాయంత్రం కళాభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సమైక్యత శిబిరాన్ని కామారెడ్డిలో నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. 14 రాష్ట్రాలకు చెందిన 250 మంది యువతీయవకులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారని నిర్వాహకులు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 30 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర అధ్యక్షుడు యాదవ్‌రాజ్, ప్రతినిధులు సంగ్రాం, అల్లావుద్దీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల విచారణ త్వరితగతిన పూర్తిచేయాలి

- నిందితులకు శిక్ష పడేలా చూడాలి
- ఎస్పీ సింధు శర్మ



బాన్సువాడలో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సింధు శర్మ

బాన్సువాడ రూరల్: కేసుల విచారణను త్వరితగతిన పూర్తిచేసి నిందితులకు శిక్షపడేలా చూడాలని ఎస్పీ సింధు శర్మ పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం ఆమె బాన్సువాడలో సబ్ డివిజన్ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దడానికి ప్రతి పోలీస్ కృషి చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్స్ పాత్ర గురించి కళాబృందాల ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కేసుల పరిశోధనలో టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు నరేశ్, కృష్ణ, సత్యనారాయణగౌడ్, ఎస్సైలు పాల్గొన్నారు.

చరిత్రపై అధ్యయనం అవసరం



నూతన కమిటీ ప్రతినిధులు

సుభాష్‌నగర్: చరిత్రపై అధ్యయనం జరగకపోతే మన భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందని, భారతీయులు అనుభవించిన కష్టాలకు కారణం చరిత్ర తెలుసుకోకపోవడమేనని ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రావు పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్‌లోని వంశీ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇతిహాస సంకలన సమితి ఇందూరు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ దేశ చరిత్రలో వక్రీకరణకు గురైన అంశాలను భవిష్యత్ తరాలకు అందించడానికి సమితి కృషి చేస్తోందన్నారు.

జిల్లా కమిటీ..

ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడిగా కలువకోట నరేష్‌కుమార్, సంరక్షకులుగా కందకుర్తి యాదవరావు, తాటి వీరేశం, కార్యాధ్యక్షుడిగా చిలుముల మోహన్ దాస్, గౌరవ సలహాదారుడిగా ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా కుమారి శైలి బెల్లాల్, ప్రధానకార్యదర్శిగా కందకుర్తి ఆనంద్ ఎన్నికయ్యారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంటుంది
- జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిపడా మందులున్నాయి
- దోమల నివారణ కోసం ప్రతి శుక్రవారం డ్రై డే..
- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



కామారెడ్డి టౌన్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి చంద్రశేఖర్ సూచించారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. దోమ తెరలు వాడాలని సూచించారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ‘సాక్షి’ గురువారం ఆయనను ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు..

ప్రశ్న: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో: వర్షాల కారణంగా నీరు నిలిస్తే దోమలు పెరిగే అవకాశాలున్నాయి. దోమలతో డెంగీ, మలేరియా, చికున్ గున్యా, ఫైలేరియా, జీకా వైరస్, మెదడువ్యాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. నిల్వ ఉంటే నీటిలో దోమల సంతానోత్పత్తి నివారణకు మందులు పిచికారీ చేయిస్తాం. స్థానిక సంస్థల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తాం. ప్రతి శుక్రవారం డ్రై డే విషయంలో ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఎవరికి వారు తమ ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. కొబ్బరి చిప్పలు, ఇనుప డబ్బాలు, పూల తొట్టీలు, టైర్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశ్న: డెంగీ, మలేరియా, విషజ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

డీఎంహెచ్‌వో: జిల్లాలో ఇప్పటివరకు డెంగీ కేసులు నమోదు కాలేదు. విషజ్వరాలతో కొందరు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఆశా కార్యకర్తలతో ఇంటింటి సర్వే చేపడుతున్నాం. అవసరం అయిన వారికి రక్తపరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తాం. స్లమ్ ఏరియాలలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. గతంలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు సోకిన ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు అవగాహన కల్పిస్తాం. వ్యాధుల విషయంలో ఇప్పటికే ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం.

ప్రశ్న: జిల్లాలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: వర్షాకాలం కావడంతో పాటుకాటు కేసులు నమోదు అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రులలో యాంటీ స్నేక్ వీనం అందుబాటులో ఉంచాం. పాము కరిస్తే భయాందోళనకు గురి కాకూడదు. వెంటనే ఆస్పత్రికి వస్తే వైద్యం అందిస్తాం. తేలు, కుక్క కాటుకు సైతం అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలలో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో: గురుకులాలు, హాస్టళ్లు, పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఈ విషయంలో ఇప్పటికే వైద్యాధికారులకు సూచనలు ఇచ్చాం. విద్యార్థులకు జ్వరాలు సోకినట్లు వార్డెన్ సమాచారం ఇస్తే వెంటనే క్యాంపు ఏర్పాటు చేస్తాం. అవసరమైనవారికి రక్త పరీక్షలు చేస్తాం. విద్యార్థులు కూడా వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి.

ప్రశ్న: సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో: ఇప్పటివరకు జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగీ తదితర వ్యాధుల నిర్ధారణకు సంబంధించిన కిట్లు కూడా అందుబాటులో ఉంచాం. గ్రామాల్లో, సబ్ సెంటర్‌లలో సైతం మందులు ఉన్నాయి. దోమల నివారణకు పిచికారి మందులు కూడా ఉన్నాయి.

చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- నాగన్నగారి మెట్లబావి పరిశీలన



మెట్లబావిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కల్పన

లింగంపేట: చారిత్రక కట్టడాలను పరిరక్షించి, వాటి గురించి భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట సమీపంలోని నాగన్నగారి మెట్లబావిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను పరిరక్షించడానికి స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నాగన్నగారి బావికి వెళ్లడానికి ఫార్మేషన్ రోడ్డు వేయించాలని ఎంపీడీవోను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటాలన్నారు. బావికి నాలుగు వైపులా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. బావి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలన్నారు. బావిని పునరుద్ధరించిన తీరును స్వచ్ఛంద సంస్థ అధికారి కల్పన కలెక్టర్‌కు వివరించారు.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, రికార్డులను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణితో మాట్లాడి మందుల నిల్వల గురించి ఆరా తీశారు. మందుల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌ను ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నీసాబేగం, డీఎల్పీవో సురేందర్, ఎంపీడీవో నరేష్, ఎంఈవో రామస్వామి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శౌకత్‌అలీ, ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్.. మాస్టారు



విద్యార్థులకు పాఠం చెబుతున్న కలెక్టర్ సంగ్వాన్



గణితంలో విద్యార్థి ప్రతిభను పరిశీలిస్తున్న కలెక్టర్, చిత్రంలో ఎంపీపీ గరీబున్నీసాబేగం

లింగంపేట: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ టీచర్‌గా మారారు. గురువారం లింగంపేటలో పర్యటించిన ఆయన.. ప్రభుత్వ బాలుర పాఠశాలను సందర్శించారు. ఆంగ్లం, గణితం పాఠాలు చెప్పారు. విద్యార్థుల పఠన, అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ చేశారు.

పనుల పరిశీలన

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల(అమ్మ ఆదర్శ పాఠశాల)లో చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. తాగునీరు, స్లాబ్‌పై ఫ్లోరింగ్, మరుగుదొడ్లు, విద్యుత్ కాంపోనెంట్‌ల మరమ్మతులను పరిశీలించి సలహాలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచికరంగా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

క్లుప్తంగా

స్టార్ ఈఎంటీ అవార్డు అందుకున్న స్వామి



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఈఎంఐ 108 అంబులెన్స్‌లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా కేంద్రానికి చెందిన ఈఎంటీ తోట స్వామి స్టార్ అవార్డు అందుకున్నారు. నిజామాబాద్ జనరల్ ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన మూడు జిల్లాల(కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్) క్లస్టర్ సమావేశంలో అత్యవసర సేవల్లో ఎక్కువ కేసులకు లైఫ్ సేవ్ చేసినందుకుగాను అవార్డులను అందించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, నిజామాబాద్ జిల్లా మేనేజర్ ప్రమోద్‌కుమార్ సిబ్బందికి అవార్డులను అందించారు.

విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ గంజ్ పాఠశాలలో చదువుతున్న 13 మంది విద్యార్థులకు హెచ్ఎం నీల లింగం తన స్వంత డబ్బులతో ఆర్టీసీ బస్ పాస్‌లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హెచ్ఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీని కలిసిన జిల్లావాసులు



పిట్లం(జుక్కల్) : కాంగ్రెస్ పార్టీ జుక్కల్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు ఇమ్రోజ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి ఇతర యూత్ నాయకులతో కలిసి గురువారం ఢిల్లీలో ఎంపీ సురేశ్‌షెట్కార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇమ్రోజ్ మాట్లాడుతూ ఇటీవల ఎంపీగా గెలిచినందుకు ఆయనను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూత్ నాయకులు శేఖర్, జీవన్, కాశోజీ, విఠల్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జుక్కల్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు ఇమ్రోజ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి, ఇతర యూత్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



దోమకొండ: మండల కేంద్రంలో బీజేవైఎం నాయకులు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బీజేవైఎం నాయకులు కార్యకర్తలకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్ జైన్, నాయకులు కుంట లక్ష్మారెడ్డి, మోటూరి శ్రీకాంత్, దోమకొండ నాయకులు పాల్గొన్నారు.

సాయం కొందరికే..!

- 'ఆసరా' ఉన్న కుటుంబానికి రూ.2500 సాయం లేనట్టే?
- జిల్లాలో 3,55,347 'మహాలక్ష్మి' దరఖాస్తులు
- రేషన్‌కార్డు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక



మోర్తాడ్(బాల్కొండ): మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 చొప్పున సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ.. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పరిశీలిస్తే సాయం కొంత మందికే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో మహాలక్ష్మి పథకానికి 3,55,347 మంది దరఖాస్తు చేసుకోగా, లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అలాగే, ఇంట్లో ఎవరైనా ఆసరా పింఛన్ పొందుతుంటే వారికి నెలవారి సాయం అందే అవకాశం లేదు. ఇప్పటికే జిల్లాలో 77,158 మంది వితంతు, 10,520 మంది ఒంటరి మహిళ, 96,264 మంది బీడీ పింఛన్(జీవన భృతి) అందుకుంటున్నారు. వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు అందుకుంటున్న వారిలోనూ మహిళలు ఉన్నారు. మెజార్టీ కుటుంబాలకు ఆసరా పథకం కింద ఏదో ఒక పింఛన్ అందుతోంది. ఇదిలా ఉండగా, ఆసరా పథకం కింద లబ్ధిపొందే కుటుంబాల్లోని మహిళలకు మహాలక్ష్మి సాయం అందించబోమని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టంగా ఉంది. ఈ లెక్కన సాయం అందుకోవడానికి అర్హత సాధించే మహిళల సంఖ్య భారీ సంఖ్యలో తగ్గిపోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరు గ్యారెంటీల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. మహాలక్ష్మి సాయం కోసం వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్ చేయగా ఆధార్‌కార్డుల అనుసంధానం, ఆసరా లబ్ధిదారుల ఇంటి నుంచి సాయం కోసం వచ్చిన దరఖాస్తులను జల్లెడ పడితే అసలైన లబ్ధిదారులు ఎవరనేది తేలనుంది. ఏది ఏమైనా మహాలక్ష్మి సాయం కోసం నిరీక్షిస్తున్న వారికి ఇంకా కొంత సమయం పట్టడంతోపాటు ఎక్కువ కుటుంబాల వారికి లబ్ధి చేకూరకపోవచ్చు.

మార్గదర్శకాలను సవరిస్తేనే..

మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వం గతంలోనే మార్గదర్శకాల ను జారీ చేసింది. గతంలో ఇచ్చిన వాటిని సవరిస్తే నే అర్హుల సంఖ్య పెరగొచ్చు.రేషన్‌కార్డు లేని కుటుంబాలకు మాత్రం సాయం అందే అవకాశం లేదు.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



స్వప్నకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే



స్వామికి చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి క్రైం: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ఇటీవల భిక్కనూరుకు చెందిన జ్యుమగోని నవ్య అనే బీఆర్ఎస్ కార్యకర్త మృతి చెందగా.. ఆమె భర్త స్వామిగౌడ్‌కు పార్టీ తరఫున రూ. 2 లక్షల బీమా పరిహారం మంజూరయ్యింది. అలాగే బీబీపేట్ మండలం యాడారం గ్రామానికి చెందిన అరేటి వడ్ల సంగమేశ్వర్ అనే కార్యకర్త మృతి చెందగా అతడి భార్య ఆరేటి స్వప్నకు సైతం బీమా పరిహారం మంజూరయ్యింది. గురువారం కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి బీమా చెక్కులను అందించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు పార్టీ కార్యకర్తలు మృతి చెందితే వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు పార్టీ బీమా చేస్తోందన్నారు. ఇద్దరు కార్యకర్తలు మృతిచెందారని, వారి కుటుంబ సభ్యులకు మంజూరైన బీమా పరిహారాన్ని అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, ఎంపీపీ బాలమణి, బీఆర్ఎస్ నాయకులు రమేశ్, భూంరెడ్డి, సాయిరెడ్డి, మహేందర్‌రెడ్డి, బల్వంత్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



నాగిరెడ్డిపేట: ప్రతిఒక్కరూ సమాచార హక్కు చట్టంతోపాటు విద్య, ఓటు, మానవహక్కుల చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని సమాచారహక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీమ్ సూచించారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో గురువారం సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రం లాంటిదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా సమాచారం కావాలంటే స.హ చట్టం-2005 ప్రకారం దరఖాస్తు చేస్తే 30 రోజుల్లో తగిన సమాచారం పొందవచ్చని చెప్పారు. అధికారులు తగిన సమాచారం ఇవ్వకుంటే పైఅధికారికి అప్పీల్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో స.హ చట్టం రాష్ట్ర కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాహిల్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ మన్మోహన్‌రెడ్డి, బేర్జనబేగం, లింగమయ్య, మదర్‌పాష, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన అల్బెండజోల్ మాత్రల పంపిణీ

నాగిరెడ్డిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యసిబ్బంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. మండలంలో మొత్తం 6647 మందికి మాత్రలు వేయాల్సి ఉండగా ఈ నెల 20న 5,916మందికి వైద్యసిబ్బంది మాత్రలు వేశారు. మిగిలిన వారికి గురువారం ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు మాత్రలను వేశారు. 731మందికి వేయాల్సి ఉండగా 724మందికి మాత్రలు వేసి 99.9శాతం లక్ష్యం నెరవేర్చినట్లు పీహెచ్‌సీ డాక్టర్ సృజన్ పేర్కొన్నారు.



నాగిరెడ్డిపేటలో చిన్నారికి మాత్ర వేస్తున్న సిబ్బంది

30 వాహనాలు స్వాధీనం


డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్, ఎంవీఐలు రాహుల్‌కుమార్, కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు, నంబరు ప్లేట్లు లేని 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలని లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రైం కార్నర్

విదేశాల్లో ఇద్దరు జిల్లా వాసులు మృతి

పొట్టచేత పట్టుకొని విదేశాలకు వెళ్లిన ఇద్దరు జిల్లావాసులు అక్కడ జరిగిన ప్రమాదాల్లో మృతి చెందారు. బహ్రెయిన్ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇందల్వాయి మండలం కేకే తండావాసి రాజుపైకి చెత్త ట్రక్కు ఎక్కడంతో అతడు మృతి చెందగా, మస్కట్‌లో రోడ్డు దాటుతున్న ధర్పల్లికి చెందిన రాము.. వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎన్నో ఆశలతో గల్ఫ్‌దేశాలకు వెళ్లిన వారు అక్కడే విగతజీవులుగా మారడం ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

బహ్రెయిన్‌లో చెత్త ట్రక్కు పైకి ఎక్కిన ఘటనలో కేకే తండావాసి..



బాదవత్ రాజు (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని కేకే తండాకు చెందిన బదావత్ రాజు గురువారం ఉదయం బహ్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధినిమిత్తం గత కొద్ది రోజుల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లిన రాజు అక్కడి మున్సిపాలిటీలో పని చేస్తున్నాడు. అక్కడి డంపింగ్ యార్డులో చెత్త ట్రక్కు ప్రమాదవశాత్తు రాజు పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్యతోపాటు ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారని తండావాసులు తెలిపారు. రాజు మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని తండావాసులు కోరుతున్నారు.

మస్కట్‌లో రోడ్డు దాటుతూ ధర్పల్లి వాసి..

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన పెర్కిట్ రాము మస్కట్‌లో బుధవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెర్కిట్ రాము (42) ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం మస్కట్‌కి వెళ్లాడు. బుధవారం రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.



రాము (ఫైల్)

వేర్వేరు చోట్ల గుండెపోటుతో ఇద్దరి మృతి

హస్నాపూర్‌కు చెందిన వ్యక్తి..



ముజీబ్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన ముజీబ్ (34) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ముజీబ్ బుధవారం ఛాతి నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులకు తెలుపగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి ముజీబ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ముజీబ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కలిగోట్‌లో గొర్రైల కాపరి..



గంగమల్లు మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన గొర్రైల కాపరి ముక్కెర గంగమల్లు (50) గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. గురువారం ఉదయం గొర్రైలను మేతకు తీసుకెళ్లిన గంగమల్లు గ్రామ శివారులోని కాకరకాయల సంతోష్ పొలంలో మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు..



రఘుపతి శ్రీనివాస్ మృతదేహం

ఎడపల్లి: మండలంలోని అంబం (వై)కి చెందిన రఘుపతి శ్రీనివాస్ (35) ఊర చెరువులో చేపలుపట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. చేపలను వేటాడేందుకు వేసిన వల శ్రీనివాస్ కాళ్లకు చుట్టుకోవడంతో అతడు నీటిలో మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి/నవీపేట: రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని మిట్టాపూర్ గ్రామ శివారులోని పొదల్లో మృతదేహం పడి ఉందని, మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, తెలుపురంగు షర్ట్, ధోతి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58591 నంబర్‌ను సంప్రదించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై అప్పారావు గురువారం తెలిపారు. కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన వారి నుంచి రూ.7910 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైన పేకాటస్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కొత్తపల్లి శివారులో..

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ అంజయ్య, స్థానిక ఎస్సై సుధీర్‌రావు సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.10,350 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామని, పట్టుబడిన వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు.

కూలిన భారీ వృక్షం



ప్రధాన రహదారిపై కూలిన వృక్షం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల శివారులోని పెద్దపూల్ వంతెన వద్ద గురువారం సాయంత్రం భారీ మామిడి వృక్షం కూలింది. వృక్షం కూలుతున్న సమయంలో మతిస్థిమితం లేని వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది. దీంతో బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారికి ఇరువైపులా గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎస్సై సుధాకర్, ఏఎస్సై రాజేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ పునరుద్ధరణ, జేసీబీతో కూలిన వృక్షాన్ని తొలగింపు పనులు చేపట్టారు.



రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలు



చెట్టు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఎస్సై

నీట్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలి



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీపై కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు విద్యార్థులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకుని ధర్నా చేపట్టారు. వరుస పేపర్ లీకేజీలతో కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ అధికారుల నిర్లక్ష్యంతో లక్షలాది విద్యార్థులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్‌కు రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు వసూలు చేసి అంగట్లో సరుకులాగా విద్యను వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్‌టీఏ చైర్మన్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నీట్, నెట్ పేపర్ లీకేజీపై భారీ ఎత్తున ఆందోళన చేస్తుంటే బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఐరేని సందీప్ కుమార్, ముదాం అరుణ్, ఆజాద్, విఠల్, సురేశ్, భరత్, సోఫియాన్, బుల్లెట్, రోషణ్, నరేందర్, సురేశ్, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో గురువారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నీట్ ప్రశ్నాపత్రాల పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు నీల నాగరాజ్, జబ్బార్ నాయక్, కుంబాల లక్ష్మణ్ యాదవ్, సతీశ్, వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బాకీడబ్బులు అడిగినందుకు బూతులు తిట్టడంతోపాటు దాడి చేశారని, ఇంటిని ధ్వంసం చేశారని మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన గొల్ల పండరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పండరి గురువారం అదే గ్రామానికి చెందిన ఇగురం రాజుగౌడ్‌కు వద్దకు వెళ్లి తనకు ఇవ్వాల్సిన రూ.25వేలు అడుగగా, ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా.. అంటూ పండిరిని రాజుగౌడ్ బూతులు తిట్టాడు. ఆ తరువాత రాజుగౌడ్‌తోపాటు అతడి అన్న యాదగిరిగౌడ్ కలిసి పండరిపై దాడి చేశారు. అనంతరం పండరి ఇంటికి వెళ్లి అతడి భార్య, వదినపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యాదగిరిగౌడ్, రాజుగౌడ్, లింగంపేటకు చెందిన పోతగోని రవిగౌడ్, బబ్లూ, అరవింద్, రాజేశ్వర్‌గౌడ్‌తోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడిఘటనపై పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు.



బొల్లారం గ్రామస్తులను విచారిస్తున్న పోలీసులు

భార్యతో గొడవపడి ఆత్మహత్య

మాచారెడ్డి: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో గురువారం చోటుచేసుకుంది. మాచారెడ్డి ఏఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్‌కు చెందిన సాడెం నర్సింలు(50) బుధవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన నర్సింలు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..



గౌతమి (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌కు చెందిన మార్గం గౌతమి(25) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న గౌతమి.. గురువారం ఉదయం భర్త రాజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మెట్‌పల్లి మండలంలోని రామ్‌లక్షెట్టిపేట్‌కు చెందిన గౌతమి కిరాజుతో ఐదేళ్ల క్రితం పెళ్లయ్యింది. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన ఆమె భర్త రాజు నెల రోజుల క్రితం తిరిగివచ్చాడు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి, తహసీల్దార్ కిరణ్మయి పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో..



రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం కారణంగా మండలంలోని బంజరా తండాకు చెందిన దరావత్ శంకర్(50) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్‌కు ఆర్థిక ఇబ్బందులు సైతం ఎక్కువయ్యాయి. దీంతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లలేకపోయాడు. మనస్తాపానికి గురైన శంకర్ జీవితంపై విరక్తిచెంది తన నివాసపు గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సంత్యాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

మంజీరానదిలో దూకి మహిళ..



సుగుణ మృతదేహం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి సమీపంలో మంజీరనదిలో దూకి కారేగాం గ్రామానికి చెందిన చెందిన సుగుణ(36) ఆత్మహత్య చేసుకుంది. గురువారం రాత్రి సుగుణ నదిలో దూకడంతో అటువైపుగా వెళ్తున్న వారు గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి భర్త ఏడాది క్రితం మృతి చెందగా, కు మారుడు, కూతురు ఉన్నారు. సుగుణ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

బోధన్ పట్టణంలో చోరీ

- 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40వేల నగదు అపహరణ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లారు. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆచన్‌పల్లి కాలనీలోని పెడగాపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న నాగలక్ష్మి గత నెల మే 23వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు నాగచంద్రారెడ్డి ఇంటికి వెళ్లింది. గురువారం తెల్లవారుజామున ఆచన్‌పల్లికి వచ్చిన నాగలక్ష్మి ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురైంది. ఇంట్లోకి వెళ్లచూడగా బీరువాలోని బంగారం, వెండి, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించింది. ఏసీపీ శ్రీనివాస్ ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీని పరిశీలించగా ముఖానికి మాస్క్‌లు ధరించిన ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తేలింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నామని సీఐ తెలిపారు.



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ వీరయ్య